# క్యాంపు ఆఫీస్‌లో నాయిని అనుచరుల దౌర్జన్యం

- మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్
- శిలాఫలకం ధ్వంసం చేయడంపై బీఆర్‌ఎస్ శ్రేణుల ఆగ్రహం
- కలెక్టర్, సీపీ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి


క్యాంపు ఆఫీస్ గేట్‌కు కాంగ్రెస్ నాయకులు కట్టిన ఆ పార్టీ జెండా

హనుమకొండ, డిసెంబర్ 10 : ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ప్రజాప్రతినిధి పరాకాష్టకు నాంది పలుకుతున్నారని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, హనుమకొండ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆరోపించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వినయ్‌భాస్కర్ సారథ్యంలో అధికారికంగా నిర్మించిన క్యాంపు కార్యాలయానికి సంబంధించిన శిలాఫలకాన్ని నాయిని రాజేందర్‌రెడ్డి అనుచరులు దౌర్జన్యంగా ధ్వంసం చేశారు. ప్రజాస్వామ్య దేశంలో అధికారికంగా చేపట్టిన శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం రాజ్యాంగ విరుద్ధమని, నాయిని రాజేందర్ రెడ్డిపై అధికారులు చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాయిని రాజేందర్‌రెడ్డి అడుగు పెట్టిన తొలి రోజే ప్రజాస్వామ్యాన్ని కించపరిచేలా వ్యవహరించారని ఆరోపించారు. పరిపాలనకు కేంద్ర బిందువు అయిన క్యాంపు కార్యాలయంలోనే అధికార దుర్వినియోగం చేస్తున్నారని, ముమ్ముందు నియోజకవర్గ పరిధిలో ఇంకెంత దౌర్జన్యానికి పాల్పడుతారో అని బీఆర్‌ఎస్ శ్రేణులు, నియోజకవర్గ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శిలాఫలకం ధ్వంసం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దానికి కారణమైన వారందరినీ చట్ట రీత్యా శిక్షించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని, హనుమకొండ జిల్లా కలెక్టర్, వరంగల్ పోలీసు కమిషనర్‌ను సామాజిక మాధ్యమాల ద్వారా నియోజక వర్గ ప్రజలు కోరారు.

# ప్రాణం ఉన్నంత వరకూ ప్రజలకు సేవ చేస్తా

- ప్రజా తీర్పును గౌరవిస్తూ అందుబాటులో ఉంటా
- పంచాయతీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలి
- వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్
- నియోజకవర్గ స్థాయి సమావేశం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్


సమావేశంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

న్యాశాయంపేట, డిసెంబర్ 10 : ప్రాణం ఉన్నంత వరకూ వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని బీఆర్‌ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని సీఎస్‌ఆర్ గార్డెన్స్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో వర్ధన్నపేట నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన బీఆర్‌ఎస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం అరూరి మాట్లాడుతూ ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన చైర్మన్లు, కన్వీనర్లు, కార్పొరేటర్లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా తీర్పును గౌరవిస్తూ ప్రజల పక్షాన నిలబడుతామన్నారు. కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటామని, ఎవరూ అధైర్యపడొద్దని అన్నారు. 2013 నుంచి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేశానని, పార్టీ నాయకులు, కార్యకర్తలు త్వరలో జరగబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకుడు నాగుర్ల వెంకన్న, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, జిల్లా రైతుబంధు అధ్యక్షురాలు లలితాయాదవ్, రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, కోఆప్షన్ సభ్యులు ఉస్మాన్ అలీ, సర్వర్, ఆత్మ చైర్మన్లు గుజ్జ గోపాల్‌రావు, కందుకూరి చంద్రమోహన్, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కార్పొరేటర్లు, పార్టీ మండల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# మడికొండలో జోనల్ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

- నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ
- హాజరుకానున్న 240 మంది విద్యార్థులు, 120 మంది గైడ్ టీచర్లు


ఎగ్జిబిట్లతో ప్రదర్శన కేంద్రానికి చేరుకుంటున్న విద్యార్థులు

మడికొండ, డిసెంబర్ 10 : మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల సీవోఈ కళాశాలలో గురుకులాల సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నుంచి 13 వరకు జోనల్ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నారు. కమ్యూనిటీ హెల్త్ అండ్ ఎన్విరాన్మెంట్, ఎనర్జీ రీసోర్స్ అండ్ కన్జర్వేషన్, ఎన్విరాన్మెంటల్ ఇష్యూ అండ్ కన్సర్న్స్, నేచురల్ రిసోర్స్ అండ్ దేర్ కన్జర్వేషన్, గుడ్ హెల్త్ అండ్ వెల్ బీయింగ్, క్లీన్ వాటర్ అండ్ శానిటేషన్ అనే ఆరు అంశాలపై విద్యార్థులు తమ ఎగ్జిబిట్లను ప్రదర్శించనున్నారు. జోన్-2లోని కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, వరంగల్, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల నుంచి 60 గురుకులాల విద్యార్థులు ఇందులో పాల్గొననున్నారు. ఒక్కో గురుకులం నుంచి రెండు అంశాలతో నలుగురు చొప్పున మొత్తం 240 మంది విద్యార్థులు, 120 మంది గైడ్ టీచర్లు హాజరుకానున్నారు. ఈ ప్రదర్శనకు హాజరయ్యే బాలబాలికలకు వేర్వేరుగా క్యాంపస్‌ను ఏర్పాటు చేసి వసతి సౌకర్యం కల్పించనున్నారు. ఇప్పటికే తమ ఎగ్జిబిట్లతో విద్యార్థులు ప్రదర్శన కేంద్రానికి చేరుకున్నారు. రీజినల్ కోఆర్డినేటర్ విద్యారాణి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



**అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం..**

సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరుగనున్న జోనల్ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రదర్శనకు హాజరయ్యే బాల బాలికలకు ఇబ్బందులు తలెత్తకుండా వేర్వేరుగా వసతి కల్పించాం. విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ఎగ్జిబిట్ల ద్వారా ప్రదర్శించనున్నారు. ప్రారంభోత్సవానికి పర్యావరణ, అటవీ శాఖల మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ సిక్తా పట్నాయక్, మేయర్ గుండు సుధారాణి తదితరులు హాజరుకానున్నారు.

– దాసరి ఉమామహేశ్వరి, గురుకులాల జిల్లా కోఆర్డినేటర్


ఐనవోలు : ఆలయ ఆవరణలో పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

## ఐనవోలు మల్లన్నకు నేటి నుంచి సుధావలి వర్ణలేపనం

### భక్తులతో సందడిగా మారిన ఆలయం

ఐనవోలు, డిసెంబర్ 10 : ఐనవోలు మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న తరుణంలో సోమవారం నుంచి 16 వరకు మూలవిరాట్‌కు సుధావలి వర్ణలేపనం(రంగులు వేసే) కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో స్వామి వారి దర్శనాన్ని నిలిపి వేయనున్నట్లు ఈవో నాగేశ్వర్‌రావు తెలిపారు. ఈ నెల 17న దృష్టికుంభం కార్యక్రమం అనంతరం మల్లికార్జునస్వామి దర్శనం యథావిధిగా ఉంటుందని వివరించారు. భక్తుల సౌకర్యార్థం ఆరు రోజుల పాటు ఉత్సవమూర్తుల దర్శనం మాత్రమే ఉంటుందని, అలాగే ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు ఈవో, ఉప ముఖ్య అర్చకులు పాతర్లపాటి రవీందర్, అర్చకుల బృందం పేర్కొన్నారు. కాగా, బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న తరుణంలో ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. స్వామి వారి ప్రీతిపాత్రమైన ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఒగ్గు పూజారులు మేలుకొల్పు అనంతరం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు బోనాలు, పట్నాలు, పాలాభిషేకాలు, అర్చనలు, కల్యాణాలు చేసి మొక్కులు చెల్లించారు. ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమాల్లో ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు ఐనవోలు మధుకర్‌శర్మ, పాతర్లపాటి శ్రీనివాస్, వేద పండితులు పురుషోత్తమశర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు మధుశర్మ, నరేశ్ శర్మ, శ్రీనివాస్, భానుశర్మ, సిబ్బంది కిరణ్, మధుకర్, శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు. కాగా, వర్ధన్నపేట ఎమ్మెల్యే కర్పూన్ రాజేశ్వరి నాగరాజు సోమవారం ఐనవోలు మల్లికార్జునస్వామి దర్శనానికి రానున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయం నుంచి వర్ధన్నపేట అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ ఉంటుందని తెలిపారు.


పొన్నాలతో మాట్లాతున్న పల్లా రాజేశ్వర్ రెడ్డి

## పొన్నాలను కలిసిన ఎమ్మెల్యే పల్లా

జనగామ రూరల్, డిసెంబర్10 : జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికై శనివారం అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేసిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పొన్నాల లక్ష్మయ్యను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఇరువురు పలు విషయాలపై చర్చించుకున్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైనందుకు పల్లాను పొన్నాల అభినందించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.


మంత్రి కొండా సురేఖకు శుభాకాంక్షలు చెబుతున్న ఉన్నతాధికారులు

## కలిసికట్టుగా పనిచేద్దాం

### అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

వరంగల్, డిసెంబర్10 (నమస్తేతెలంగాణ): రాష్ట్రంలో అడవులు, పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం మరింతగా పెంచేందుకు కలిసి కట్టుగా పనిచేద్దామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ అన్నారు. రాష్ట్ర మంత్రి వర్గంలో స్థానం పొందిన కొండా సురేఖను ఆదివారం అటవీశాఖ, దేవాదాయ శాఖ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొండా సురేఖను అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ఆర్‌ఎం డోబ్రియల్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో పర్యావరణం, అడవుల రక్షణ, పచ్చదనం మరింతగా పెంచేందుకు కలిసి కట్టుగా పనిచేస్తామన్నారు. అంతకు ముందు దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్ ఇతర అధికారులు, పండితులు మంత్రి కొండా దంపతులను ఆశీర్వదించారు. కాగా, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రిగా సోమవారం ఉదయం 10 గంటలకు బాధ్యతలను చేపట్టనున్నట్లు కొండా సురేఖ వెల్లడించారు.